# డిఫరెన్స్ - శేడింబి శేషగిరి రావు



అప్పుడే ఆఫీసునుండి వచ్చిన రఘు స్కూటర్ పార్కు చేసి ఇంట్లోకొచ్చాడు.

"ఏమిటండీ" ఈరోజు చాలా ఆలస్యమైంది?" అడిగింది భార్య లలిత.

"ఇవాళ ఆఫీసులో ఇన్స్పెక్షన్ జరిగింది ....అందుకని ఆలస్యమైంది లలితా.... అన్నట్లు మన బాబెక్కడ?" చేతిలోని బొమ్మలు....బిస్కెట్ పాకెట్లు... చాక్లెట్లు.... టేబుల్ పైన పెడుతూ అన్నాడు రఘు.

"అబ్బ! ఇంటికిరాగానే ముందర బాబు కనపడాలి. అసలు వాడిని వదిలి ఆఫీసులో అంతసేపు ఎలా గడుపుతున్నారో....బాబు పుట్టకముందు "లల్లీ" అంటూ ఎంత ప్రేమ పలకబోసేవారో...." ఉడుగ్గా అంది లలిత.

"అదేం కాదే పిచ్చిదానా....మనకు ఒక్కగానొక్క కొడుకు....నీకు కాన్పు కష్టమై ఆపరేషన అది ఇదీ నానాహంగామా జరిగి....ఇక మనకు పిల్లలు పుట్టే అవకాశం లేదని తెలుసుకదా....అందుకనే వాడంటే నాకు ప్రాణం వాడికోసం ఏం చేయటానికైనా సిద్ధమే.... అంతేకానీ నీపై ప్రేమ లేక కాదు!" అర్ధంగా అన్నాడు రఘు.

లలిత కళ్ళలో తడి మెరిసింది!

"సరేకాని ఇక భోజనానికి రండి!" అంది లలిత.

"కాస్సేపాగు....బాబుతో కొంచెంసేపు ఆడుకొని వస్తాను" అంటూ అంతలో పిల్లవాడు రావడం వాడిని ఎత్తుకొని ఆడించటం మొదలుపెట్టాడు రఘు.

"అబ్బ! పిల్లవాడుంటే చాలు ఇంక ఏమక్కర్లేదు" అంటూ వాళ్ళను ఆనందంగా చూస్తూంఢి పోయింది లలిత.

రఘు....లలితల పెళ్ళై రెండు సంవత్స

రాలు కావస్తోంది. రఘుకి బ్యాంకులో ఉద్యోగం....నాలుగంకెల జీతం....వాళ్ళు ఉంటున్న ఇల్లు ఊరికి దూరంగా ఉన్న ఒక కాలనీ. అక్కడ ఇళ్ళన్నీ విసిరేసినట్లుగా దూర దూరంగా ఉన్నాయి. వాటికి అవతల ఏదో కూలీ లపూరి గుడిసెలు తప్ప ఇంకేం లేవు.

*　　*　　*

రిక్షాని ఒక పక్కగా పెట్టి మల్లెపూలపొట్లాన్ని తీసికొని గుడిసెలోకి నడిచాడు నారిగాడు.

"ఏంది మావా.... ఇంతాలీసమైనాది ఈయాల" "బాడుగలు బాగా కుదిరినాయే.... దాంతో రావడం ఆలీసమైంది...." అంటూ తెచ్చిన మల్లెపూల పొట్లాన్ని లచ్చిమి కిచ్చాడు. నారిగాడు సిగ్గుపడుతూ పూలు తీసుకుంది లచ్చిమి.

"తానం సేసిరా మావా....ఈయాల సేపల పులుసు సేసిన తిందువుగాని" ప్రేమగా అంది లచ్చిమి.

"ఏంది పిల్లడు ఇయాల తెప్పన్నే బజ్జున్నడు...." అంటూ తడికల దగ్గరికి పోయి స్నానం చేయసాగాడు నారిగాడు.

"ఏంది మావా....రోజూ నాకు పూలెట్లు కొ త్తావు గానీ....ఏ నాడైనా బుజ్జోడికి పాక్లెట్లు....బిసుకోట్లు కొని తెచ్చినావా....?" ఉడుక్కుంటూ అంది లచ్చిమి.

నవ్వుతున్నాడు నారిగాడు.

చేపల పులుసుతో అన్నం తిన్న నారిగాడు ప్రక్కపై ఒరిగాడు. పక్కనే వచ్చి నిల్చుంది లచ్చిమి.

"ఇటు రాయే...." అన్నాడు నారిగాడు లచ్చిమిని పట్టిలాగుతూ....

"పో....మావా నీకెప్పుడూ కొ త్తే.... బుజ్జోడు లేత్తడు" అంటూ దూరంగా జరిగింది లచ్చిమి.

"అబ్బా....ఎపుడూ ఆడిగోడపేనా....ఆడు బజ్జున్నడుగాని ఇటురాయే" అంటూ లచ్చిమి చేయి పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు నారిగాడు.

అంతలోనే తనకిష్టం లేదన్నట్లుగా పిల్లవాడు ఉలిక్కిపడి లేచి ఏడవటం మొదలెట్టాడు. దాంతో వాడిదగ్గరికి వెళ్ళి పాలిస్తూ లాలించసాగింది లచ్చిమి.

"ఛీ! ఛీ! ఎదవ సంతానం ఆడు పుట్టిన కాడ్నుంచి సుఖం లేకుండా పోయింది" విసుక్కుంటూ అటుతిరిగి ముసుగుతన్నాడు నారిగాడు.

తనలో తను నవ్వుకుంది లచ్చిమి ప్రేమగా వాడి వీపు నిమురుతూ.

*　　*　　*

ఇలా వీరి జీవితాలు సాగిపోతుంటే ఈ కథ రాయాల్సిన అవసరం ఉండేదికాదు. ఒక రోజు వీరి జీవితాల్లో తుఫాను చెలరేగింది. ఆ రోజు జరిగిన సంఘటన వారి పాలిట శాపంలా పరిణమించింది.

*　　*　　*

ఒకరోజు రాత్రి....రోజూ రాత్రిలాగే.... పిల్లవాడిని లాలించి....కాస్సేపు వాడితో ఆడుకొని వెళ్ళి భోజనం చేసి వచ్చి బాబును తన పక్కనే ఉంచుకుని నిద్రపోయాడు రఘు..... అతనితోపాటు లలిత కూడా పక్కనే....!

రోజులాగే లచ్చిమిపై విసుక్కుంటూ.... సుఖానికడ్డొస్తున్న బుజ్జిగాడ్ని తిట్టుకుంటూ పడుకున్నాడు నారిగాడు.

అర్ధరాత్రి దాటింది....

కొందరు రౌడీలు తాగి, తలుపులు పగులగొట్టుకొని రఘు ఇంట్లోకి ప్రవేశించారు.

అదే సమయంలో....అదే విధంగా నారిగాడి ఇంట్లోకికూడా....కొందరు రౌడీలు ప్రవేశించారు.

వాళ్ళకి నీతిలేదు జాతిలేదు పాపంలేదు— పుణ్యంలేదు....ధర్మం న్యాయం అసలులేదు ....వాళ్ళు వంచకులు....నీచులు....దొంగలు ....హంతకులు.

ఉలిక్కిపడి లేచిన భార్య భర్తలు భయంతో బిగదీసుకుపోయారు ఏం చేయాలో తెలియని పరిస్థితి....అంతే వాళ్ళు రఘుపై పడి హింసించసాగారు.

లలిత భోరున ఏడుస్తూ "రక్షించండి" అంటూ అరుస్తూనే....వాళ్ళని ప్రాధేయపడసాగింది. తన భర్తని ఏమీ చేయవద్దని కానీ ఆమెకేం తెలుసు వారికి "కరుణ" అనేది లేదని...."కసి" వాళ్ళకాభరణం అని....

రఘు స్పృహ తప్పాడు!

మైకంతో నిండిన కళ్ళలో కామం తొణికిసలాడింది....కానీ లొంగలేదు వాళ్ళకి లలిత. ఆత్మహత్యా ప్రయత్నానికి తలపడపోయింది....కానీ ఎదురుగా కనబడ్డ దృశ్యం చూసి....ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది.

**　　**　　**

వాళ్ళను ప్రతిఘటించే శక్తి సన్నగిల్లి స్పృహ తప్పాడు నారిగాడు.

లచ్చిమి ఏడవసాగింది. వూరికే కాదు లగ్గరెత్తి ఏడిచింది. అది చూడలేక పిల్లవాడు కూడా కేర్....కేర్ ....మంటూ ఏడవసాగాడు. వాళ్ళు లచ్చిమివేపు నడిచారు. బైటకు పరుగెత్తబోయింది లచ్చిమి.... తప్పించుకోబోయింది.

అంతలో ఎదురుగా వాళ్ళు తన ....ఆ దృశ్యం చూపి....

**　　**　　**

"అబ్బా....అంటూ మూలుగుతూ లేచిన రఘుకు ఎదురుగా లలిత....చిందరవందరగా చెదిరిన జుట్టు....పంటిపై గాట్లు....గీట్లపైన దుప్పటిలా కప్పుకున్న చీరె....పక్కనే ఏడుస్తున్న బాబు...."

జరిగిందేమిటో అర్థం చేసుకున్న రఘు మౌనంగా వెళ్ళి ఓ మూల కూలబడ్డాడు.

ఆయాసంతో తూలిపోతూ నడుచుకుంటూ వచ్చింది లలిత.

"ఏమండీ....నా జీవితం నాశనమైపోయిందండీ...వాళ్ళు నన్ను చెరిచారు. అసలు వాళ్ళు నన్ను చెరచకముందే ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను కానీ... కానీ... వాళ్ళు నేను లొంగక పోతే బాబుని చంపేస్తామని బెదిరించారు....అదిగో వాడి బుగ్గపై ఆ కత్తి గాటు చూడండి....బాబు లేకుండా మీరు.... అందుకే గత్యంతరం లేక వాళ్ళకు లొంగిపోయానండీ...." అంటూ గుండెలవిసేలా విలపించసాగింది లలిత.

ఓదార్చలేదు రఘు .... అదోమాదిరిగా చూసాడు లలిత వంక .... అతడి మెదడు మరుగుతున్న నీళ్ళలా కుతకుతలాడుతుంది.... ఆ చూపులో ఏదో అర్థం గోచరించింది లలితకు....

*　　*　　*

"మావా .... తప్పించుకుందామని ప్రయత్నం సేసిన మావా....కానీ ఆ దొంగ నచ్చినోళ్ళు మన బుజ్జోడివి గొంతు పిసికి సంపేత్తమని బెదిరించిన్రు మావా .... ఆడి కోసం ఏం సేయాలా అని సూత్తుండగానే నా మానం దోచేసుకున్నారు లం.కొడుకులు...."

"నన్ను క్షమించు మావా....నే పాపం సేసిన....నే సచ్చిపోతానుమావా...."రోదించసాగింది లచ్చిమి.

"ఏడువకే లచ్చి....నీదేం తప్పుందే ఇందులో....యిదంతా పీడకలే అనుకొని మరిసిపోదామే....మన బుజ్జోడి కోసమే కదా ....

నీ కన్నపానం నాకు తెలుసే....ఆ పాపిష్టి లం.కొడుకులను భగవంతుడే సిచ్చిత్తాడే .... నువ్వేం బాధపడకు." అంటూ లచ్చిమిని హృదయాని కత్తుకున్నాడు. అతడి కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి

*　　*　　*　　*

కాని........

భర్త తిరస్కారానికి గురైన లలిత రోజూ అతని ఛీత్కారింపులు భరించలేక వెళ్ళిపోయింది....ఈ లోకాన్నే వదిలి వెళ్ళిపోయింది....రఘు మాత్రం తన కొడుకును ప్రేమగానే పెంచుతున్నాడు....?